# ప్రతి ఒక్కరికి మరొకరు కావాలి (మత్తయి 16:13-19)

దేవుడు మనుష్యుని నిర్మించిన తరువాత, ''నరుడు ఒంటరిగా ఉండుట మంచిది కాదు'' అని ఆయన అన్నారు (ఆది. 2:18). ఒంటరి తనం అనేది ఘోరమైన పరిస్థితియే.

> (ఒంటరి తనం) అనేది సమస్యగా పిలువబడి ఈ దినాల్లో జనులను వేదించినంతగా మరెన్నడూ వేదించలేదు. ''ఈ యుగంలో బహుగా పాడు చేసే మానసిక వ్యాధి'' యని ప్రముఖ స్విస్ మానసిక రోగాల వైద్యుడు దాన్ని పిలుస్తాడు. ''అంత తీవ్రమైన - లేక సార్వత్రికమైన మానవ స్థితి మరేదీలేదని పన్నెకెక్కిన వైద్యుడు ఇటీవల అన్నాడు.

ఈ జీవితంలో మనకు కావలసింది - ''వలవలె అల్లిక చేయబడిన'' ఆధారమై యుండు గుంపు (సంఘం).

ఆత్మసంబంధమైన పరిధిలో కూడా యిది సత్యమే. (లేకుంటే), ''నీవు క్రైస్తవుడవైన తరువాత, నీయంత నీవే ఉండుమని దేవుడు అని యుండేవాడే.'' అయితే, మనకందరికి బలం కావాలని, సహాయం కావాలని ఆయనకు తెలుసు. గనుక అలా ఆధారమై యుండే దేవుని సంఘాన్ని కడతానని యేసు వాగ్దానం చేసిన దానిని గూర్చి ఈ పాఠం తెలియజేస్తుంది. మన పాఠ్యభాగం మత్తయి 16:13-19, దేవుడు మనకు అనుగ్రహించు యితర సహాయాన్ని గూర్చి కూడా సూచిస్తుంది.

(ప్రభువైన) యేసు తన వ్యక్తిగత పరిచర్య యొక్క చివరి ఘట్టానికి వచ్చారు. లూకా 9:51లో ఉపయోగించబడిన పద ప్రయోగం చేసినట్లయితే, త్వరలో ''ఆయన యెరూషలేమునకు వెళ్లుటకు మనస్సు సిద్ధపరచు''కొన్నారు. అది ప్రభువునకు ప్రాముఖ్యమైన సమయం. ఆయన శిష్యులకు అది ప్రాముఖ్యమైన కాలం.

## నీకు ఒక వ్యక్తి అవసరం

''యేసు ఫిలిప్పుదైనకైసరయ ప్రాంతమునకు వచ్చి'' అంటూ మన పాఠ్యభాగం ప్రారంభ మౌతుంది (13a వ.).

పాలస్తీనాలో ''కైసరయ'' లనేవి రెండున్నాయి. ఒకటి మధ్యధరా సముద్రపు తీర ప్రాంతంలో ఉంది. మన పాఠ్య భాగంలోనిది మాత్రం పాలస్తీనాకు చివర ఈశాన్య మూలంలో ఉంది. ప్రభువైన యేసు జన్మించిన కొద్ది కాలానికే చతుర్థాధిపతియైన హేరోదు ఫిలిప్పు పినెయాస్సనే ప్రాచీన పట్టణాన్ని తిరుగకట్టి, కైసరునకునూ, తనకునూ ఘనత కలిగేలా, కైసరయ ఫిలిప్పీ అనే పేరు దానికి పెట్టాడు. గుర్తింపదగిన ఆ పట్టణం యొక్క విశేషమేమంటే - అది గట్టి బండమీద కట్టబడింది - హెర్మోను పర్వతపు దిగువ భాగాన పరచుకొనియున్న సున్నపు రాతిమీద అది కట్టబడింది.

బోధించుకొంటూ, ప్రజలకు సహాయం చేస్తూ, చేసిన తన ప్రయాణంలో, యేసును తన శిష్యులును ఫిలిప్పుదైన కైసరయ ప్రాంతానికి వచ్చారు. భూ పరిచర్యలో ఉత్తర దిశగా ఆయన చేసిన ప్రయాణానికి యిదే చివరిది.

ఆయన ఆ చోటికి వచ్చినప్పుడు, యేసు తన శిష్యులకు పరీక్ష పెట్టారు. పరీక్ష అనేది విద్యార్థులకే కాదు ఉపాధ్యాయులకు కూడా భయాన్ని కలిగించే సంఘటనయే. ''నేను నొక్కి చెప్పగోరిన దాన్ని వారికి అందించ గలిగానా?'' అని ఉపాధ్యాయుడు ఆశ్చర్యపడతాడు. అయినా, ''మనుష్యకుమారుడెవడని జనులు చెప్పుకొనుచున్నారు?'' అని అడుగుతూ, యేసు తన పరీక్షను ప్రారంభించారు (13b వ.).

''కొందరు బాప్తిస్మమిచ్చు యోహానని యు, కొందరు ఏలీయా అనియు, కొందరు యిర్మీయా అనియు లేక ప్రవక్తలలో ఒకడనియు చెప్పుకొనుచున్నారని'' ఆయన శిష్యులు జవాబిచ్చారు. యేసు ఎవరో అనే విషయమై జనులు సతమత మౌతున్నారు. యేసు మెస్సీయా యొక్క కార్యాలు చేస్తున్నమాట వాస్తవమే. అయితే మెస్సీయా వస్తాడని వారు ఊహించినట్టుగా రాలేదు. అయినా, ఆయన ఒక ప్రత్యేకమైన వ్యక్తియని వారికి తెలుసు. గనుక ఆయన బాప్తిస్మమిచ్చు యోహానని, ఏలీయా అని, యిర్మీయా అని, లేక ప్రవక్తల్లో ఒకడని వారనుకొంటున్నారు.

''ఆత్మ పరకాయ ప్రవేశం'' - త్వరలో మరో జన్మ ఎత్తే సిద్ధాంతాన్ని యూదులు నమ్ముతారు గనుకనే వారు యిలా అన్నట్టు కొందరు అభిప్రాయపడ్డారు. యేసు మృతులలోనుండి లేపబడిన యోహానేయని హేరోదు పుకారు రేపాడు (మార్కు 6:14, 16). పైగా, ఏలీయా తిరిగి ప్రత్యక్షమౌతాడనే విషయంలో యూదులకు వింతైన భావాలుండేవి. మెస్సీయాకు మార్గం సరాళం చేసేవాడుగా ఏలీయా పంపబడతాడన్న దేవుని వాగ్దానంతో వాటిని వారు ముడివేశారు (మలాకీ 4:4-6). ''మరు జన్మ'' అనే సిద్ధాంతాన్ని యూదులు నమ్మేరో లేదో తెలియదు గాని, ఒక వేళ వారు దాన్ని నమ్మినా, అది - అప్పుడూ - యిప్పుడు - తప్పుడు సిద్ధాంతమే. ''మనుష్యులు ఒక్కసారే (అనేక సార్లు కాదు) మరణించవలెనని నియమింపబడెను.'' ఆ తరువాత (మరణం తరువాత) తీర్పు జరుగును (భూమి మీద మరొక దేహంలో

క్రొత్త జీవితం లేదు) అని బైబిలు చెప్పుతుంది (హెబ్రీ. 9:27).

యేసు ఆ వ్యక్తుల్లో ఒకడని వారు ఎందువలన నమ్మినా, ఆ గొప్ప వారిలో ఒకనిగా యూదులు ఆయనన్ను గుర్తించారంటే, యేసును గూర్చిన ప్రత్యేకత తప్పక ఉందన్నమాటే. వేషధారణకు విరోధంగా మాట్లాడడానికి వెనుకాడని యొక దృఢ నమ్మకంగల వ్యక్తి - యోహాను. అలాగే యూదుల్లో ఉన్న వేషధారణను బయట పెట్టినవాడు యేసు. దుష్టశక్తులకు విరోధంగా నిలిచిన ధైర్యశాలి - యోహాను. అలాగే ఆనాటి శక్తివంతులైన మత నాయకులకు వ్యతిరేకంగా నిలిచినవాడు యేసు. మరోవైపు, యిర్మీయా కనికరంగలవాడు తన ప్రజల కొరకు విలపించినవాడు. అలాగే యేసు అక్కర గలవాడై జనుల కొరకు కన్నీరు విడిచారు. ప్రజలు యేసును కనిపెట్టి చూచినప్పుడు - కొందరు ఆయన కాఠిన్యాన్ని చూచారు; మరి కొందరు ఆయన మృదుత్వాన్ని చూచారు.

ఈ పోలికలన్నీ తగినవేగాని, వారు ఈ విషయంలో వెళ్ల వలసినంత దూరం వెళ్లలేదు. యేసు అత్యున్నతుడు - ఆయన దేవుని సొంత కుమారుడని మనం భావించనంతవరకు, యేసు గొప్పవాడని మనం అన్నా అపవాదికి అభ్యంతరం లేదు.

తన పరీక్షలో రెండవ ప్రశ్నను యేసు తన శిష్యులకిచ్చారు. చివరి తరగతి వారికి యిది నూటికి నూరు శాతం యిస్తుంది. ''అందుకాయన - మీరైతే నేను ఎవడనని చెప్పుకొనుచున్నారని వారి నడిగెను'' (15 వ.).

ఎవరిని గూర్చియైనా యింతకంటే ప్రాముఖ్యమైన ప్రశ్న అడగబోయేది ఉండదు. ''యేసును గూర్చి నీ అభిప్రాయమేమి?'' ఆ ప్రశ్నకు సరియైన జవాబు యివ్వకపోతే, ఈ జీవితానికి గాని, నిత్యత్వానికిగాని అవసరమైన సహాయ, ఆధారములు నీకు ఎన్నటికిని లభించవు.

నేనే యేసునై యుండినట్లయితే, ఆతురతగల లేక దిగులు చెందిన ఉపాధ్యాయుడనై యుండేవాడనే. నా ఆలోచనలు యిలా ఉండేయే: ''మూడు సంవత్సరాలుగా నా మాటలు, నా మహత్కార్యాలు, నా జీవితం - ఒక్క సత్యాన్ని నా విద్యార్థుల మనస్సులో నాటాలనుకున్నాను; నేనెవరైయున్నాను? అనే సత్యాన్నే. వారు ఆ సత్యాన్ని గ్రహించారా? ఉపాధ్యాయునిగా నేనెంత విజయాన్ని సాధించాను?''

పేతురు ఆ ప్రశ్నకు జవాబిచ్చాడు. పేతురు కల్లా కపటం లేనివాడుగా గుర్తింపబడ్డాడు - అతడు త్వరపడి మాట్లాడుతూ ఉండేవాడు. ఏది ఎలాగున్నా, ఈసారి పేతురు సరియైన సమాధానం చెప్పాడు: ''నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు'' అని అతడన్నాడు (16 వ.). ''క్రీస్తు'' అంటే అభిషిక్తుడని అర్థం. మెస్సీయా అనే మాటకు అది గ్రీకు రూపం. పాత నిబంధన కాలంలోని జనులు ప్రవక్తలను, యాజకులను, రాజులను అభిషేకించేవారు. ఈ మూడునూ యేసునందు ఏకమై యున్నాయి. లేక ఆయన ఈ ముగ్గురైయున్నారు. ''యొక్క కుమారుడు'' అనేది

హెబ్రీ భాషా ప్రయోగంలో - ''వారి స్వభావంలో పాలుగల'' అనే భావాన్ని యిస్తుంది. ఆ విధంగా, ''సజీవుడగు దేవుని కుమారుడు'' అంటే - ''దేవుని స్వభావంలో పాలుగలవాడు'' అని అర్థం.

స్పష్టీకరించిన మాటలను పట్టుకొనియుండు. అవసరమైన వ్యక్తిని గూర్చి అవి నీకు తెలియజేస్తాయి. దీన్ని గూర్చి ఎక్కువగా, చెప్పకముందు, యిక్కడ యింకా కొన్ని సంగతులను గుర్తించుదాం.

అందుకు యేసు - ''సీమోను బర్ యోనా, నీవు ధన్యుడవు'' అని అన్నారు (17a వ.). అంతకు పూర్వం యేసు, ఎవరైనా తన్ను ఒప్పుకొంటే, ఆయన వారిని ఒప్పుకొంటానని వాగ్దానం చేశారు (మత్తయి 10:32). గనుక యిప్పుడు ఆయన పేతురును ఒప్పు కొంటున్నారు. ''రక్త మాంసములు దీనిని నీకు బయలుపరచలేదు'' (17b వ.). ఈ సత్యాన్ని పేతురు ఏ నరుని యొద్దనుండి నేర్చుకో లేదన్నమాట. కారణం? మానవ జ్ఞానమైతే - యేసు బాప్తిస్మమిచ్చు యోహానని, ఏలీయా అని, యిర్మీయా అని, లేక ప్రవక్తల్లో ఒకడని అన్నది. జనాలు అన్నదానితో పేతురు ఏకీభవించలేదే. దేవుడే పేతురు వర్తమానానికి మూలమని యేసు చెప్పారు. ''పరలోకమందున్న నా తండ్రియే'' (17c వ.). ఈ ప్రశ్ననాలోచించు: పేతురు ఈ సత్యాన్ని ఎలా నేర్చుకున్నాడు? దీన్ని అతడు యేసు నొద్ద నేర్చుకున్నాడా? ''యేసు దేవుని యొద్దనుండి'' వచ్చినవాడే (యోహాను 8:28). ఆయన దేవుడై యున్నాడు.

> అప్పుడు యేసు - ''మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను పరలోక రాజ్యము యొక్క తాళపు చెవులు నీ కిచ్చెదను, నీవు భూ లోకమందు దేని బంధించుదువో అది పరలోకమందును బంధింపబడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని అతనితో చెప్పెను'' (18-19 వచ.).

పేతురు మొదట జవాబిచ్చాడు. గనుక అతడు క్లాసు ఎదుట నిలబడాలి. పేతురుకు ప్రత్యేకమైన గుర్తింపు యివ్వబడిన వాస్తవాన్ని మనం కాదనలేం.

అతన్ని ''పేతురు'' అని యేసు తొలిసారి అధికార పూర్వకంగా పిలిచారు. ఈ పేరుతోనే అతడు బాగుగా తెలియ బడ్డాడు. పేతురు అంటే - ''రాయి'' అని అర్థం. గాలికి కొట్టు కొనిపోయే ఇసుక లాంటి శిష్యుడు గాక, బండలా స్థిరంగా ఉండే శిష్యుడుగా యేసు అతన్ని గుర్తిస్తున్నారు. అయితే అతని మార్పు సంపూర్తి అయ్యిందని దాని భావం కాదు. తరువాత అధ్యాయంలో తిరిగి అతడు అర్థరహితంగానే మాట్లాడాడు, ''నీకు ఒకటియు, మోషేకు ఒకటియు, ఏలీయాకు ఒకటియు, మూడు పర్ణ శాలలు'' కడతామని అతడు మరలా తొందరపడ్డాడు. మరికొన్ని అధ్యాయాలు తరువాత అతడు ప్రభువును ఎరుగనని అన్నాడు. అయినా అతడు పురోగమించుతున్నట్టే వుంది. ''పేతురు'' అనే పేరు ఆత్మసంబంధంగా అతడెంత

దూరం వచ్చాడో, అతడింకా ఎంతదూరం వెళ్ల బోతాడో అనే వాటిని సూచిస్తుంది.

రెండవది, యేసు అతనికి రాజ్యం యొక్క తాళపు చెవుల నిచ్చారు ( రోములోని సెయింట్ పీటర్ బాసిలికలోను, యింకా అనేక యితర స్థలాల్లోను తాళాల గుత్తితో అపొస్తలుడైన పేతురు యొక్క విగ్రహాన్ని నిలబెట్టారు). వాటి సంగతి ఎలాగున్నా, యూదుల్లోను, అన్యజనుల్లోను దేవుని రాజ్యపు ద్వారాలు తెరిచేలా తాళపు చెవులను ఉపయోగించే ఏకైక అవకాశాన్ని పేతురు పొందాడు: అపొ. 2లో యూదులకు, అపొ. 10లో అన్యజనులకు. మరో విధంగా చెప్పాలంటే - జనులు దేవుని రాజ్యంలోనికి అంగీకరింపబడే షరత్తులను తొలిగా ప్రకటించే ఘనత పేతురుకు యివ్వబడింది.

19వ వచనంలో - ''బంధింపబడుట'' - ''విప్పబడుట'' అని ప్రభువు చెప్పిన దానిలో ఉన్న ప్రాముఖ్యత ఏమి? ఏమంటే - పేతురు ప్రసంగిస్తాడు, అయినా దాన్ని అతడు దైవ ప్రేరేపణ వలన చేస్తాడని అది సూచిస్తుంది ( యోహాను 14:26; 16:13). **NASB** తొలిగా ప్రింటయినప్పుడు, ఆదిభాషలో ఉన్నట్టే క్రియాకాలం అందులో సూచింపబడింది: ''నీవు భూలోకమందు దేని బంధించుదువో, అది పరలోక మందును బంధింపబడియుండును భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడియుండును''. దీన్ని మరో విధంగా చెప్పాలంటే, పేతురు యొక్క వర్తమానం మొదట పరలోకమందు బంధింపబడుతుంది; అప్పుడది భూలోకమందు బంధింపబడుతుంది. అంటే, అతని వర్తమానం దేవునివలననే గాని, అతనివలన కలిగింది కాదు.

పేతురు చాల ప్రత్యేకమైన వ్యక్తి అనే దానికి ఎలాటి సందేహమూ లేదు. అపొస్తలుల పేర్ల పట్టీలన్నీ అతని పేరుతోనే ప్రారంభమౌతాయి. అతన్ని మనం ఎన్నడూ తక్కువగా అంచనా వేయకూడదు. అందువలన అతన్ని ఎక్కువ అంచనా కూడా వేయకూడదు.

మత్తయి 16:13-19 లో మెస్సీయాగా యేసుపై దృష్టి కేంద్రీకరించబడింది - మనకు కావలసినవాడు ఆయనే - అయితే కొందరు ఈ పాఠ్యభాగాన్ని వక్రంగా త్రిప్పి, ప్రాథమికంగా పేతురును హెచ్చించే దానికి దీన్ని ప్రయోగించారు. సంఘం కట్టబడిన బండ పేతురేనని వారు ఉపదేశించారు. ''బంధించుట'' - ''విప్పుట'' అనే విషయాల్లో పేతురు ఏకైక స్థానాన్ని పొందినట్టు వారు నిర్బంధం చేస్తారు. పేతురే సంఘానికి తొలి శిరస్సు అని వారు ప్రకటిస్తారు. ఆ స్థానాన్ని అతడు వారసులకు అప్పగించినట్టు, అలా నేడు నిలిచిన వారసుడే నీకు నాకు అవసరమైనట్టు వారంటారు. అయితే, వీటిలో ఏ భావాలను లేఖనాలు బోధించడం లేదు.

ఇంతకు ముందుగా మనం అనుకున్నట్టు, ''పేతురు'' అనే పేరు గ్రీకులో ఉన్న ''పెట్రోస్'' అనే పదాన్ని (తెలుగులోనికి) భాషా రూపం మార్చినందున వచ్చింది. పెట్రోస్ అంటే - బండ లేక ''రాయి'' అని అర్థం. రాయికి పెట్రోస్

అనేది మామూలు పదం, నీ చేతితో ఎత్తి పట్టుకోగల బండ. అయితే మత్తయి. 16:18 లో ''పెట్రా'' అనే పదం వాడబడింది. పెట్రా అనేది - ఫిలిప్పుదైన కైసరయ పట్టణం కట్టబడిందే, ఆ సున్నపురాయి దళం లాంటి బహు గొప్పదైన రాతి ముద్దను సూచిస్తుంది. ''నీవు పేతురువు, ఈ బండ మీద నా సంఘమును కట్టుదును'' అని యేసు చెప్పినప్పుడు ఆయన మాటలతో ఆటాడినట్టున్నారు: ''పేతురూ, నీవు చిన్న బండవు - అయితే బహు గొప్పదైయున్న ఈ బండ మీద (అంటే, నీవు ఒప్పుకున్న ఆ సత్యముందే - దాని మీద) నా సంఘమును కట్టుదును'' అని ఆయన అన్నారు.

''బంధించుట'' - ''విడిపించుట'' అనే వాటి విషయంలోనైతే, రెండు అధ్యాయాల తదుపరి, పేతురుకు చేసిన వాగ్దానమే, తక్కిన అపొస్తలుల కందరికిని యివ్వబడింది (మత్తయి 18:18).

మత్తయి 16:13-19 - పేతురు ప్రాముఖ్యమైనవాడు అని బోధించిన మాట వాస్తవమే గాని, భూమి మీద సంఘానికి అతడు మొదటి శిరస్సుగా ఉండవలసినవాడని మాత్రం అది బోధించలేదు. పాఠ్యాంశంగా, చారిత్రాత్మకంగా, తార్కికంగా దాన్ని పరిశీలించినట్లయితే, మత్తయి 16 నొక్కి చెప్పింది యేసు క్రీస్తును గూర్చియే గాని, పేతురును గూర్చిగాని మరి ఏ యితర నరుని గూర్చి కాదని తేలుతుంది.

దురదృష్టవశాత్తు, నరమాత్రులను హెచ్చించే స్వభావం (లేక ధోరణి) పేతురును హెచ్చించడంతోనే ఆరంభమో, అంతమో కాదు. బోధించడానికి మీకు ఈ వ్యక్తే కావాలి, (లేక) ఆ వ్యక్తే కావాలి అంటూ కొందరు పిడివాదం చేయనారంభించారు. (లేక నీ ప్రార్థనలు దేవుని యొద్దకు వెళ్లడానికి, భౌతికంగాను, ఆర్థికంగాను వర్ధిల్లడానికి) మన దినాల్లో పాస్టరుతో ముడి పడిన సంఘం, ఆ ఒకని చుట్టు అనేక చిన్న సంఘాలు అభివృద్ధి చేయబడుతున్న తీరు సహజమైపోయింది. మనుష్యుడు ఎంత గొప్పవాడైనా, నీ విశ్వాసమూ, నిరీక్షణ నరమాత్రుని మీద నిలిచినట్టయితే, నీవు తప్పక నిరాశ చెందవలసి వస్తుంది.

నీకు అవసరమైన వ్యక్తి యేసుక్రీస్తే గాని, కేవలం నరమాత్రుడు కాడు. యేసు పరలోకంనుండి దిగి వచ్చారు. శరీరం యొక్క బలహీనతల్లో ఆయన పాలుపొందారు (ఫిలిప్పీ. 2:5-8) ఆయన మనవలె అన్ని విధాల శోధింపబడ్డారు (హెబ్రీ. 4:15). గనుక మన బలహీనతలను ఆయన అర్థం చేసికొంటారు. ఆయన మనకు సహాయం చేయగలరు (హెబ్రీ. 2:18). ఆయన మన పక్షంగా ఉంటారు; ఆయన మనకు మధ్యవర్తి (1 తిమోతి 2:5). పౌలు చెరసాలలో ఉన్నప్పుడు - ''ఎవడును నా పక్షమున నిలువలేదు. అందరు నన్ను విడిచిపోయారు. ప్రభువు నా ప్రక్కన నిలిచి నన్ను బలపరచారు'' అని అన్నాడు (2 తిమోతి 4:16-17), ఆయన నీ ప్రక్కన కూడా నిలిచియుంటారు. ''ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతో కూడ''

ఉన్నానని ఆయన వాగ్దానం చేశారు (మత్తయి 28:20).

## నీకు ఒక జనం కావాలి

నీకు కలిగిన దేవుని అనుగ్రహంలో, ఆయన నీకు ఒక వ్యక్తిని ప్రసాదించడంతోనే నిలుపలేదు. యేసునందు నీ విశ్వాసంలో పాలు కలిగి, - ఈ జీవిత సంఘర్షణలో నీతో భాగస్వాములైయున్న ఒక జనాన్ని కూడా ఆయన నీకు దయచేశారు.

మరొక కోణంనుండి ఆ లేఖన భాగాన్ని ఆలోచించడానికిగాను మనం తిరిగి 18-19 వచనాల దగ్గరకు వెళ్లుదాం. ''మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువ నేరవని నీతో చెప్పుచున్నాను. పరలోక రాజ్యము యొక్క తాళపు చెవులు నీ కిచ్చెదను . . . .'' ఆ వ్యక్తితో ప్రత్యేకమైన బాంధవ్యమున్న ఒక జనాన్ని గూర్చి ఈ వచనాలు తెలియజేస్తాయి.

''ఈ బండ మీద నా సంఘమును కట్టుదు''నని యేసు అన్నారు. ''ఎక్లేషియా'' - అనే గ్రీకు పదంనుండి ''సంఘము'' అనే మాట తర్జుమా చేయబడింది. ఎక్లేషియా అనే గ్రీకు రూపం రెండు పదాల కలయికయైయుంది. దీనికి అక్షరార్థం - ''బయటికి పిలువబడిన'' అనేది. గనుక సంఘం యొక్క సభ్యులందరు - ''బయటికి పిలువబడినవారు. వీరు లోకంలోనుండి క్రీస్తుతో నూతన బాంధవ్యం కలిగి యుండడానికి పిలువబడినవారు. అపొస్తలుల కార్యగ్రంథంలో, ఈ ప్రజలు సువార్త వలన పిలువబడినవారు. (2 థెస్స. 2:14). వారా పిలుపును విన్నప్పుడు యేసునందు విశ్వాసముంచి, బాప్తిస్మం (నీళ్లలో ముంచడం) పొందినట్లయితే, ప్రభువు వారిని సంఘంలో చేర్చుతారు (అపొ. 2:38, 41, 47). క్రీస్తు రక్తంచేత రక్షింపబడిన ఆ జనమే - సంఘం (అపొ. 20:28; ఎఫెసీ. 5:23, 25).

క్రీస్తు సంఘం - ఒక ప్రత్యేకమైన జనం. ''ఈ బండమీద నా సంఘమును కట్టుదును'' అని యేసు అన్నారు. ''సంఘం'' అనే పదం ఏకవచనమే. గనుక సంఘం అనేది ఒక్కటే (1కొరింథీ. 12:13; ఎఫెసీ. 1:22-23; 4:4; కొలస్సీ. 3:15). అది ఆయన సంఘం అంటే - అది ఆయనకు చెందుతుంది, ఆయనకు మాత్రమే చెందుతుంది. వ్యక్తులుగా ఆ సంఘ సభ్యులు, ''క్రీస్తుకు చెందినవారనే'' భావంతో, ''క్రైస్తవులు'' అని పిలువబడ్డారు (అపొ. 11:26; 26:28; 1 పేతురు 4:16). సామూహికంగా, ఆ సంఘం, క్రీస్తుకే చెందింది అనే భావంతో, క్రీస్తు సంఘం లేక ''క్రీస్తు సంఘములు'' అని పిలువబడింది (రోమా 16:16).

''సంఘం'' అని పిలువబడే ఈ ప్రత్యేకమైన జనానికి ఒక ప్రత్యేకమైన పునాది వుంది. ''ఈ బండమీద నా సంఘమును కట్టుదును'' అని యేసు చెప్పారు. పేతురు చేసిన ''ఒప్పుకోలు'' ఆ బండను సూచిస్తుంది. అది - ''యేసు సజీవుడగు దేవుని

కుమారుడైన క్రీస్తు'' అనే స్థిరమైన సత్యమే. ''వేయబడినది తప్ప మరియొక పునాది ఎవడును వేయనేరడు; ఈ పునాది యేసుక్రీస్తే'' యని పౌలు తెలియ జేశాడు (1 కొరింథీ. 3:11). యేసే మన ''బండ'' (పెట్రా) (1 కొరింథీ. 10:4). భావాలు, సూత్రాలు, వ్యక్తులు అనేవాటి మీద కట్టబడిన సంస్థలు - కొన్నిసార్లు గొప్ప భావాలు, సూత్రాలు, వ్యక్తులు - అనేవాటి (వారి) మీద కట్టబడవచ్చు, లేక పోవచ్చు. అయితే ఏ సంస్థ కూడా దాని పునాది కంటె శ్రేష్ఠమయ్యిందిగా ఉండనేరదు సంఘానికి పునాది మాత్రం - యేసు క్రీస్తే!

ప్రత్యేకమైన పునాదిగల ఈ ప్రత్యేకమైన గుంపు ఒక ప్రత్యేకమైన గుణలక్షణం కలిగియుంది: అది లయము కానిది (లేక నశింప చేయబడనిది). ''- బండమీద నా సంఘమును కట్టుదును. పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవు'' అని ప్రభువైన యేసు ప్రకటించారు. ''పాతాళం'' అంటే అక్షరార్థం - ''అదృశ్య మైనది'' - అని. అది తీర్పు కొరకు ఆత్మలు వేచియుండే స్థలం; దేహాలు లేని ఆత్మలుండే అదృశ్యమైన లేక కంటికి కనబడని చోటు. ఈ లోకానికి ''ద్వారం'' శరీర మరణమే! ఆయన కట్టే సంఘాన్ని ఏ శక్తీ అదుపులో పెట్టలేదు - కడకు మరణమైనా సరే! యని యేసు చెప్పారు.

దీన్ని వెంబడించిన చరిత్ర - యేసు మాటలు సత్యమని రుజువు చేసింది. సంఘ స్థాపనను అరికట్టాలని, యేసును చంపడం ద్వారా సాతాను మరణాన్ని సాధనంగా వినియోగించాడు. అయితే, ఆయన మరణమే మన రక్షణకు మూలమయ్యింది. సంఘం స్థాపింపబడిన తరువాత, సంఘ సభ్యులను చంపడం ద్వారా, సంఘం పురోగమనాన్ని నిరోధించాలని అపవాది మరణాన్ని తిరిగి సాధనంగా వాడుకొన్నాడు. హత సాక్షుల రక్తం సంఘాన్ని సంరక్షించి, విస్తరింపజేసింది.

వాస్తవంగా, సంఘ సభ్యుల్లో ప్రతి ఒక్కరు చంపబడినా, ఇట్టి చర్య సంఘాన్ని నశింప జేయలేదు. ఎందుకంటే - ఈ రాజ్యానికి ''విత్తనం'' - దేవుని వాక్యం (లూకా 8:11). దేవుని వాక్యం - ''అక్షయమైనది'' (1పేతురు 1:23-25). ఈ వాక్య మున్నంత కాలం, యథార్థ హృదయాలతో జనులు దాన్ని చదివినప్పుడు, ఆ హృదయాల్లో బీజం నాటబడినట్టే ఆ విత్తనం ఫలించడం ద్వారా విధేయత వస్తుంది. దాని వలన జనులు సంఘానికి చేర్చబడతారు (అపొ. 2:38, 41, 47). యేసు యొక్క జన్మకు అనేక సంవత్సరాల పూర్వమే ''ఎన్నటికి లయము కాని'' రాజ్యాన్ని దేవుడు స్థాపిస్తారని దానియేలు ప్రవచించాడు (దాని. 2:44).

చివరిగా, ప్రత్యేకమైన పునాది, ప్రత్యేకమైన గుణ లక్షణంగల ఈ ప్రత్యేకమైన గుంపు - ప్రత్యేకమైన స్వభావం కలిగియుంది: అది మహిమగలది. అది దేవుని రాజ్యం.

ఈ సంస్థను వర్ణించడానికి ప్రయోగింపబడిన పదాల్లో ప్రతి ఒక్కటి - అది ఎంత ఆశ్చర్య కరమయిందోయని అభినందించడానికి తోడ్పడుతుంది. ''సంఘం'',

''రాజ్యం'' అనే రెండు పదాలు మన పాఠ్య భాగంలో వినియోగించబడ్డాయి. లోకానికి సంబంధించినంత మట్టుకు, ఈ ప్రత్యేకమైన గుంపును - సంఘం - లేక వెలుపలికి పిలువబడిన వారని అన్నారు. దేవునికి సంబంధించి, దేవుని కాపుదలలో కనికరం గల ఆయన ఆధిపత్యానికి తమ్మును తాము లోబరచుకునే వారు గనుక - వారు (దేవుని) ''రాజ్యమని'' పిలువబడ్డారు.

ఇతర స్థలాల్లో వినియోగింపబడ్డ పదాలు: ప్రభువైన యేసుకు సంబంధించి, తమ రక్షకునితో సజీవ సంబంధం కలిగి, ఆయన చిత్తాన్నిబట్టి నడిపింపబడే జనంగా, ఆ సంఘం - ఆయన శరీర మనబడింది (ఎఫెసీ. 1:22-23). ఒకరితో నొకరికిగల బాంధవ్యాన్నిబట్టి, సంఘం, (దేవుని) కుటుంబమనబడింది (1తిమోతి 3:15). దేవుడు మనకు తండ్రి, క్రీస్తు ప్రభువు మన అన్నగారు; క్రీస్తునందు మనమందరం సోదర సోదరీలం.

ఈ గొప్ప సత్యాలను గూర్చి మనం ఆలోచించే కొలది, మనలో ప్రతి ఒక్కరికి కావలసిన ప్రజలు వీరేననే నిర్ణయానికి మనం రాక తప్పదు.

నేను నా కుటుంబంతో లోకాన్ని చుట్టివచ్చేటప్పుడు మేము లెక్కించుకున్న ఒక సంగతేమంటే: మేము ఎక్కడున్నా, క్రీస్తునందున్న సహోదర, సహోదరీలను కనుక్కోగలం అనేదే! మేము మాట్లాడని మరొక భాషవారు మాట్లాడవచ్చు గాని, యేసునందిలి మా విశ్వాసం, ఆయన పనికొరకైన మా సమర్పణ -అనేవి భాషా ఆటంకాలను అధిగమించిన బాంధవ్యాన్ని మాకు కలిగించాయి.

ఈ సందర్భంలో పారిస్‌లో ఒక సాయంకాలపు అనుభవం మనస్సుకు వస్తుంది. మే 1, 1973 బుధవారం నేను నా కుటుంబంతో పారిస్‌కు వచ్చాను. పారిస్‌లో సంఘ కూడిక స్థలానికి పైనున్న మిషనెరీ క్వార్టర్స్‌లో మకాం ఉండే ఏర్పాట్లు చేసికొన్నాను. కార్డినల్ అనే ఫ్రెంచ్ సువార్తికుడు, బుధవారం బైబిలు తరగతికి దాదాపు 30 నిమిషాలు ముందుగా వచ్చి, మాకు బసను చూపించాడు. త్వరగా మేము శుభ్రం చేసికొని, వారితో కూడ ఆ తరగతిలో కలసికొనడానికి దిగివచ్చాం. యూరప్‌లో మే 1సెలవు దినం గనుక ఎక్కువ మంది ప్రజలు పట్టణాన్ని వదలి వెళ్ళారు, గనుక కొద్దిమంది మాత్రమే అక్కడ కూడారు. మేము నిలబడి కొద్ది మాటలతో, ఎక్కువ గురుతులతో సమాచారాన్ని ఒకరితో ఒకరం పంచుకున్నాం. కొంత సేపటికి, ఆ సువార్తికుడు మా కుటుంబాన్ని బయటికి పిలిచి, ఒక వీధివైపు చూపుతూ, ''ఆర్క్ డి ట్రయంఫ్'' అని అన్నాడు. అతడు రేపు మమ్మును పట్టణం చూడడానికి తీసికొని వెళ్ళుతానంటు న్నాడేమో అని తలంచాం. కాని అప్పుడే రమ్మని అతడు కోరుతున్నట్టు తరువాత అర్థమయ్యింది. అయితే సోదర సోదరీలతో కలసి ఆరాధించడానికి ఉద్దేశించాం కాని, ఆ రోజున ఊరు చూచే ఉద్దేశం తమకు లేదని అతన్ని అతి కష్టంతో ఒప్పించగలిగాం.

చివరికి, మేమందరం కలిసి ఒక చిన్న గదిలోనికి వెళ్లి అక్కడున్న టేబుల్ చుట్టూ

కూర్చున్నాం. కార్డినల్ కొన్ని పాటలు ఫ్రెంచ్‌లో నడిపించాడు. చాయిని గుర్తించి వారితో కలిసి మేము ఇంగ్లీషులో పాడాం. సో. కార్డినల్‌గారు ఫ్రెంచ్‌లో ప్రార్థన నడిపించారు. నన్ను ఇంగ్లీషులో ప్రార్థన చేయమన్నారు. తరువాత తాను చెప్పదలచుకొన్న సంగతులు చెప్పాడు. వాటిలో కొన్ని మాటలే మేము అర్థం చేసికోగలిగాం. ఒక చోట మాత్రం, మమ్ములను అతడొక ఉదాహరణగా ఉపయోగించినట్టు గ్రహించగలిగాం. మా యింటి వద్దనుండి వేల మైళ్ల దూరంలో, భాష మాటలాడలేని స్థలంలో మేము ఉన్నాం. అయినా మేము (దేవుని) కుటుంబంతో ఉన్నాం.

నేనెక్కడ బోధించినా, బాప్తిస్మం తరువాత ప్రార్థనకు మేము తరచుగా గుండ్రంగా నిలుస్తాం. ''ఈ చిన్న వలయం భూ మండల మంతటిలో వ్యాపించియున్న నీ క్రొత్త కుటుంబాన్ని సూచిస్తుంది. నీవు లోకంలో ఎక్కడికి వెళ్లినా, నీలాటి విశ్వాసం కలిగి, నిన్ను ప్రేమించి, నీ యందు అక్కర కలిగియున్న వారిని నీవు కనుగొన గలవు'' అని ఆ క్రొత్తగా క్రైస్తవుడైన వ్యక్తికి తెలియజేస్తాను.

నీకు యిది అవసరం. ఇది నీకు అవసరమని ప్రభువుకు తెలుసు. అందుకే - సంఘమని పిలువబడే ఈ ప్రత్యేకమైన ప్రజలను ఆయన అనుగ్రహించారు.

అయితే ఈ ఏర్పాటు దాని కంతటికి అదే జరుగదు. నీవు ఆ సంఘ సభ్యుడవై యుండి కూడా, జీవించుతున్న వారందరిలో నీవే ఏకాకివైయుండవచ్చు. ''ఒంటరి తనం అనేది తన్నుతాను వేరుచేసి కొనడం కాదుగాని, యితరులను తనతో కలవనియ్యకుండడమే'' నని ఒకడు అన్నాడు. ''ఒంటరి తనమనేది లోపలనుండి తెరువబడగల చెరసాలయే'' నని మరొకడన్నాడు. నీ జీవితాన్ని దీవించడానికే దేవుడు సంఘాన్ని స్థాపించారు, గాని నీవు ఈ ఏర్పాటును ప్రయోజనపరచుకోవాలి. అయితే నిప్పు ఆర్పే యంత్రాని అప్పుడప్పుడు తనికీ చేసినట్టు, నీవు సంఘ కూడికకు అప్పుడప్పుడు వస్తే దాన్ని నీవు సద్వినియోగం చేసికోలేవు. గనుక నీవు సజీవ సంబంధాలను దానితో పెంచుకోవలసిన అవసరముంది. సంఘ జీవితంలోను పనిలోను నీవు పాలు కలవాడవైనట్టుండాలి. అది నీవు జరిగించినప్పుడు, దేవుడు మన కెట్టి ఆశ్చర్యకరమైన ఏర్పాటును గావించారో నీకు తెలియవస్తుంది!

నేను తరచుగా దుఃఖకరమైన యిలాటి మాటలు వింటూ వుంటాను: ''మేము క్రొత్త స్థలానికి వచ్చాం ... మేము ఆరు నెలలుగా యిక్కడ ఉంటున్నాం... ఇంతవరకు మాకు స్నేహితులెవరూలేరు''. ఇలాటి భావాలను నేను విన్నప్పుడు, ''వారికి కావలసింది ప్రభువు సంఘం. ఒక వేళ నా కుటుంబం ఆ ప్రాంతానికి వెళ్లినట్లయితే, కారు నడిపించుకొని వెళ్ల గలిగినంత దూరంలో మేము ఆధార పడగలిగిన గుంపును కలిగి యుండగల'' మని నేను అనుకుంటా! ''అక్కడ సంఘం లేకుంటే నేనేమి చేసేవాడనో నాకే తెలియదు'' ''ఎక్కడ సంఘముందో ఎక్కడ లేదో నాకు తెలియదు''

అని జనులు అనుకొనడం తరచుగా వింటుంటా.

నన్ను అపార్థం చేసికోకండి. ఆత్మ సంబంధంగా బలపరచే గుంపే సంఘమంటే - అని నేను అనడంలేదు. అది సత్యానికి స్తంభంగాను ఆధారంగాను ఉండేలా దేవుడు సంఘాన్ని స్థాపించారు (1 తిమోతి 3:15). దేవుని నానా విధమైన జ్ఞానాన్ని ప్రచురం చేయడానికి అది నియమించబడింది (ఎఫెసీ. 3:10). పరలోకం యొక్క పనిని అది నెరవేర్చేది మాత్రమేగాక, జీవితం తుఫానులతో కొట్టబడుతున్న వారికి ఆశ్రయంగా అది పని చేస్తుంది.

అంతేకాదు. సంఘం యిచ్చే సహాయం ఒక పక్షంగా ఉన్న ఏర్పాటేనని నేను అనడం లేదు. సంఘాన్ని కొందరు అవకాశంగా తీసికొంటారు. ''ప్రతివాడు నా అవసరతలు తీర్చడానికే బ్రతుకుతున్నాడని'' వారు భావిస్తారు. సంఘం పరస్పర సహకారం కొరకు ఏర్పాటైన గుంపు; మనం ఒకరి యెడల ఒకరం అక్కర గలవారమై యుండాలి.

మన కందరికి కావలసింది ''సంఘం'' అనే జనమేనని మత్తయి 16:13-19 ప్రకటిస్తుంది.

## ముగింపు

మత్తయి 16లో వాగ్దానం చేసినట్టు సంఘ - రాజ్యాన్ని యేసు ఎప్పుడు స్థాపించారు? ఆయన ఘనమైన వాగ్దానపు నెరవేర్పు అపొ. 2 లో కన్పిస్తుంది.

క్రీస్తు యొక్క మరణం, సమాధి, పునరుత్థానాల తరువాత వచ్చిన తొలి పెంతెకొస్తు దినాన - మనకందరికి అవసరమైన వ్యక్తిని (గూర్చి) పేతురు లేచి ప్రసంగించాడు :

> మీరు సిలువ వేసిన యీ యేసునే దేవుడు, ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెనని చెప్పెను.
>
> వారు ఈ మాట విని హృదయములో నొచ్చుకొని - సహోదరులారా, మేమేమి చేతుమని పేతురును కడమ అపొస్తలులను అడుగగా, పేతురు- మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు (అపొ. 2:36-38).

ఇంతకు పేతురు చెప్పిందేమంటే, ''నీవు మారుమనస్సు పొంది బాప్తిస్మం పొందినప్పుడు నీ గత పాపాలు తీసివేయబడతాయి: గత పాపాలకు క్షమాపణ లభిస్తుంది. నీ భవిష్యత్తుకు కూడా సహాయం పొందుతావు. క్రైస్తవ జీవితాన్ని జీవించడానికి దేవుని ఆత్మ యొక్క సహాయం నీకు లభిస్తుంది!'' నీవు బాప్తిస్మం పొందినప్పుడు, రక్షింపబడెడి, బలపరచబడెడి బాంధవ్యం నీకు అవసరమైన వ్యక్తితో ఏర్పడుతుందని చెప్పవచ్చు. పౌలు దీన్ని ఈ విధంగా అంటున్నాడు: ''యేసుక్రీస్తు నందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు'' (గలతీ.

3:26-27).

అపొ. 2:41ని గమనించు: ''కాబట్టి అతని వాక్యము అంగీకరించిన వారు బాప్తిస్మము పొందిరి; ఆ దినమందు ఇంచుమించు మూడు వేలమంది చేర్చబడిరి''. ''మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో చేర్చుచుండెను'' అని 47వ వచనం అంటుంది. అనేక ప్రాచీన ప్రతులలో ఈ మాటలున్నాయి: ''ప్రభువు సంఘమునకు అనుదినము చేర్చుచుండెను'' (KJVని చూడు). వారు బాప్తిస్మం పొందినప్పుడు క్రీస్తులోనికి మాత్రమే బాప్తిస్మం పొందలేదు; సంఘమనే ఆయన శరీరంలోనికి కూడా బాప్తిస్మం పొందారు (1 కొరింథీ. 12:13; ఎఫెసీ. 1:22-23). ఆ శరీరంలో వారి బాంధవ్యం అపొ. 2:42, 44 ల్లో యిలా చెప్పబడింది: ''వీరు అపొస్తలుల బోధయందును సహవాసమందును, రొట్టె విరుచుట యందును ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి ... విశ్వసించిన వారందరు ఏకముగా కూడి తమకు కలిగినదంతయు సమష్టిగా ఉంచుకొనిరి''. వారికి కలిగినదంతయు ''ఒకరితో నొకరు పంచుకొన్నారు.'' ఆ విధంగా క్రొత్తగా క్రైస్తవులైన ఆ జనం తమకు అవసరమైన ప్రజలను కూడా కలిగియున్నారు.

నీకు వ్యక్తి కావలి: యేసుక్రీస్తు. నీకు ప్రజలు కావలి: ప్రభువు యొక్క సంఘం. నీవు యింకా క్రీస్తులోనికి, ఆయన శరీరంలోనికి బాప్తిస్మం పొందకుండ ఉన్నట్లయితే, నీవు అలాగు త్వరగా ముంచడం పొంది, నీ జీవితానికి కావలసిన ఈ అవసరతలను తృప్తిపరచ వలసిందని మనవి చేస్తున్నాను.